## తమిళనాట కుల ఘర్షణలు

# దళితుల చైతన్యం - సవర్ణుల అసహనం

ఈ సంవత్సరం మే నెలతో మొదలుపెట్టి తమిళనాడులో దళితులకూ సవర్ణులకూ మధ్య హింసాత్మక ఘర్షణలు రెండునెలల పాటు జరిగాయి. సంఘటనలు కొన్ని గ్రామాలకే పరిమితం అయినప్పటికీ ఘర్షణ వాతావరణం ఆ రాష్ట్రంలోని దక్షిణాది జిల్లాలన్నిటిలోనూ నెలకొనింది. ఒక గ్రామంలో జరిగిన ఘటన మరొక గ్రామంలో ప్రతిచర్యకు దారితీసింది. ఒక జిల్లాలో జరిగిన ఘటనలకు పక్క జిల్లాలో నిరసన వ్యక్తమయింది. ఇట్లా ఆ రాష్ట్రంలో మూడవవంతు భూభాగంలో ఘర్షణ వాతావరణం నెలకొనడం ఆలోచనాపరులందరినీ కలవరపరిచింది. ఘర్షణలను ఎట్లాగయినా నివారించడం అవసరం అని ఆ రాష్ట్రంలోని ప్రజాస్వామిక వాదులందరూ భావించారు. ఎందుకంటే ఇవి పైకి చూడడానికి ఘర్షణలుగానే కనిపించినా (అంటే ఇరుపక్షాలూ దాడులకు పాల్పడినా) ఘర్షణ పడింది సమానులు కారు. ఒక వైపున్నది పళ్లర్, పరయర్, అరుంధతీయర్ మొదలైన దళిత కులాలు కాగా రెండవ వైపున్నది తేవర్, నాడర్, నాయుడు మొదలైన సవర్ణులు. ఇరువర్గాలూ ఘర్షణపడినా దళితులే ఎక్కువగా నష్టపోతారు. అంతేకాక ఇటువంటి ఘర్షణలు సంఘజీవిత వాతావరణాన్నీ సంస్కృతినీ ధ్వంసం చేస్తాయి. అవి కేవలం వ్యక్తిగత ఘర్షణలు కావు. 'మీరెంతో మేమూ అంతే'నసే దళిత చైతన్యాన్ని సహించలేని సవర్ణ అహంకారం వీటికి మూలం. అది పెరిగేకొద్దీ, ఘర్షణలలో రాటుదేలే కొద్దీ సామాజిక జీవన సంస్కృతి మరింత కలుషితం అవుతుంది.

ఈ కారణంగా ఆందోళన చెందిన పి.యు.సి.ఎల్ (తమిళనాడు రాష్ట్ర శాఖ) ఘర్షణలు నెలకొన్న దక్షిణాది జిల్లాలలో ఐదురోజులు పర్యటించి ఒక వివరమైన నివేదిక ప్రచురించింది. అందులోని ముఖ్యమైన విషయాలు ఇక్కడ ఇస్తున్నాము.

'పెరియార్' అని తమిళులు పిలుచుకునే రామస్వామి నాయకర్ ప్రభావం వల్ల తమిళ రాజకీయ సంస్కృతిలో 'ఆత్మగౌరవ' రాజకీయాలకు ప్రముఖ స్థానం ఉంది. ఈనాటికీ తమిళ రాజకీయాలలో అదొక ముఖ్య అంశంగానే ఉంది. మనుషుల మధ్య ఆర్థిక అసమానతలు ఉండడం, ఉత్పత్తి రంగంలో సమాన ప్రతిపత్తి లేకపోవడం ఒక రకమైన అసమానత కాగా, మనుషులందరికీ ఒకే రకమైన విలువ లేకపోవడం, మనుషులకిచ్చే సామాజిక విలువలో హెచ్చుతగ్గులుండడం ఇంకొక రకమైన అసమానత. ఇది ప్రధానంగా కులవ్యవస్థ నుండి వచ్చింది. దీనిని వ్యతిరేకించే చైతన్యం 'ఆత్మగౌరవ ఉద్యమాల' రూపం తీసుకోవడం సహజం. బ్రాహ్మణేతర (శూద్ర) కులాల ఆత్మగౌరవ పోరాటాలు, దళితుల ఆత్మగౌరవ పోరాటాలు, తమిళజాతి ఆత్మగౌరవ పోరాటం తమిళ రాజకీయాలలో ప్రధాన పాత్ర నిర్వహించాయి.

ఆయా ప్రజాశ్రేణులకు చెందిన నాయకుల విగ్రహాలు ప్రతిష్ఠించడం, ఊర్లకూ రోడ్లకూ వారి పేర్లు పెట్టుకోవడం ఆత్మగౌరవ రాజకీయాలలో సర్వత్రా ఉండే లక్షణమే. విడిగా చూస్తే అర్థరహితంగా కనిపించే ఈ క్రియను ఆత్మగౌరవ రాజకీయాలకొక వ్యక్తీకరణగా అర్థం చేసుకున్నప్పుడే సహృదయంగా అర్థం చేసుకోగలుగుతాం.

తమిళనాట ఈ నామకరణ పోటీ చాలా తీవ్రంగా ఉంటుంది. ఊర్లకే కాదు - జిల్లాలకు, రోడ్డురవాణా సంస్థలకు కూడ తమిళజాతి గర్వించే చారిత్రక వ్యక్తుల పేర్లు, వివిధ పీడిత కులాలు తమవారిగా భావించే ప్రముఖుల పేర్లు పెట్టుకున్నారు. సహజంగానే, ఒకరు ఆత్మగౌరవ రాజకీయాలలో భాగంగా ఈ పని చేస్తే, మరొకరు దానిని తిరస్కరించే ఆధిపత్య రాజకీయాలలో భాగంగా తమవారి పేర్లు కూడ పెట్టుకుంటారు. జయలలిత వంటివారు వ్యక్తిగత అహంభావంతో తమ పేర్లు పెట్టుకునే ప్రయత్నమూ చేస్తారు. వెరసి తమిళనాడులో అంబేద్కర్, పెరియార్, అన్నాదురై, రాజాజీ, కామరాజ్, ఎం.జి. రామచంద్రన్‌ల పేరిట జిల్లాలు ఉన్నాయి. వీరేకాక మనకు (అంటే బయటివారికి) పేర్లు సహితం తెలియని తమిళ ప్రముఖుల పేర్లమీద కూడ జిల్లాలున్నాయి. ఆ రాష్ట్రంలోని 28 జిల్లాలలో ఎవ్వరి పేరూ తగిలించని జిల్లాలు 6 మాత్రమే! నిజానికి తమిళనాడు జనాభా ఆంధ్రప్రదేశ్ జనాభా కంటే తక్కువ అయినప్పటికీ మనకు 23 జిల్లాలే ఉండగా అక్కడ 28 ఉండడానికొక కారణం కొత్తగా చైతన్యవంతులవుతున్న ప్రతి ఒక్క ప్రజాశ్రేణికి సంబంధించిన ఒక ప్రముఖుడి పేరిట ఒక జిల్లాను ప్రకటించవలసిన అవసరం ఉందని తమిళ రాజకీయ నాయకులు భావించడమే. దీనిని అర్థరహితమైన బుజ్జగింపుగా భావించడం కంటే ఆత్మగౌరవ రాజకీయాలలో భాగంగా అర్థం చేసుకోవడం ఉపయోగకరంగా ఉంటుంది.

జిల్లాలలాగే రవాణా సంస్థలు కూడ. మన రాష్ట్రంలో ప్రభుత్వరంగంలో ఒకే ఒక్క రోడ్డు రవాణా సంస్థ ఉంది. తమిళనాడులో అనేకం ఉన్నాయి. అన్నీ ప్రభుత్వరంగంలోనివే కాని అన్నీ వేరువేరు కార్పొరేషన్‌లు. మొదట్లో తమిళ జాతీయభావానికి ప్రతీకలైన మూడు ప్రాచీన రాజవంశాల పేరిట (పాండ్య, చోళ, చేర) మూడు రోడ్డు రవాణా కార్పొరేషన్‌లు ఉండేవి. తరువాత వాటి సంఖ్య పెరిగింది. ఒక్కొక్క ప్రముఖుడి పేరుమీద ఒక్కొక్క ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ వచ్చింది. (చివరికి జయలలిత తన పేరు మీద కూడ ఒక ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ పెట్టుకోగా, కరుణానిధి ముఖ్యమంత్రి అయిన తరువాత దానిని రాజీవ్‌గాంధీ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్‌గా మార్చాడు). ఈ క్రమంలో వివిధ సవర్ణకులాల నాయకుల పేరిట కూడా రోడ్డురవాణా సంస్థలొచ్చాయి. కానీ ఒక దళిత నాయకుడి పేరిట ఒక సంస్థ నెలకొల్పాలని ఈ సంవత్సరం ప్రభుత్వం ప్రయత్నం చేసేసరికి సవర్ణులు

అల్లరి చేశారు. ఘర్షణలకు ఇదొక ముఖ్య కారణం.

పోనీ అతనేమయినా సమకాలీన దళిత రాజకీయనాయకుడా అంటే కాదు. అతని పేరు వీరన్ సుందరలింగం. అతను పల్లర్‌కులానికి చెందిన దళితుడు. గత శతాబ్దంలో బ్రిటిష్‌పాలనకు వ్యతిరేకంగా తిరగబడి ఉరికంబం ఎక్కిన వీరపాండ్య కట్టబొమ్మన్ సహచరుడు. కట్టబొమ్మన్‌ను తమిళ జాతీయవాదులు తమ జాతీయహీరోగా భావిస్తారు. కానీ అతని సన్నిహితుడైన సుందరలింగం పేరిట విరుధ్‌నగర్ జిల్లాలో ఒక రోడ్డురవాణా సంస్థను నెలకొల్పే ప్రయత్నాన్ని స్థానిక అగ్రకులమైన తేవర్ కులస్తులు సహించలేకపోయారు. పోనీ తేవర్ కులస్తులకు హీరోలు లేరా, వారిని తమిళనాడు ప్రభుత్వం ఆదరించలేదా అంటే అది నిజం కాదు. బ్రిటిష్ హయాంలో ముత్తురామలింగ తేవర్ అనే జాతీయవాది ఉండేవాడు. అతనిని బ్రిటిష్ పాలకులు 'ఎన్‌కౌంటర్'లో కాల్చి చంపారు. ఆ ముత్తురామలింగ తేవర్ పేరుమీద ప్రస్తుతం తమిళనాడులో ఒక జిల్లా కూడ ఉంది. (మదురై జిల్లాను చీల్చి ఈ జిల్లాను తయారుచేసారు). కానీ అదే బ్రిటిష్‌పాలనకు వ్యతిరేకంగా పోరాడిన వీరన్ సుందరలింగం పేరుమీద ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ నెలకొల్పడాన్ని తేవర్ యువకులు సహించలేకపోయారు. తేవర్‌లది సామాజికంగా, రాజకీయంగా బలమైన కులం. వివిధ రాజకీయ పార్టీలలో వారికి ప్రముఖ స్థానముంది. అయితే కుల అహంకారాన్ని రాజకీయపార్టీల ద్వారా ప్రత్యక్షంగా ప్రదర్శించడం కష్టం కాబట్టి తేవర్ పెరువై (తేవర్ వేదిక) అనే కులసంఘాన్ని ఏర్పాటు చేసుకున్నారు. దానికి పోన్ పరమగురు అనే రిటైర్డ్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు అధ్యక్షుడు.

కులసమీకరణలో చారిత్రక వ్యక్తులకు ఎంత పాత్ర ఉండగలదో సమకాలీన సినీతారలకు కూడ అంత ఉండగలదు. తేవర్ యువకులు వీర్పాటు చేసుకున్న వేదికలలో ఒకటి కార్తీక్ అనే సినిమా హీరో అభిమాన సంఘం. ఈ 'కార్తీక్ మన్రం'లు దళితుల ఆకాంక్షలకు వ్యతిరేకంగా తేవర్ యువకులను సమీకరించడానికి అనువయిన వేదికలుగా పనిచేసాయి. ఆ సినిమా హీరో ఫోటోలు, బొమ్మలు తేవర్ కుల అహంకారానికి చిహ్నాలయ్యాయి.

అయితే ట్రాన్స్‌పోర్ట్ సంస్థ పేరుకు సంబంధించిన వివాదమే ఘర్షణలకు ఏకైక కారణం కాదు. దానినే ఏకైక కారణంగా తమిళ పత్రికలు చూపించడాన్ని పి.యు.సి.ఎల్ నివేదిక తప్పుపట్టింది. దళితుల ఆత్మగౌరవ పోరాటం పట్ల సవర్ణులలో చాలా లోతయిన వ్యతిరేకత ఉందనీ దానిని కేవలం ఒక రోడ్డు రవాణా సంస్థ పేరుకు సంబంధించిన వ్యతిరేకతగా చూపించడం సమస్యను తక్కువ చేసి చూపించడం అవుతుందనీ పి.యు.సి.ఎల్ భావించింది.

ఆత్మగౌరవ పోరాటంలో భాగంగానే పల్లర్ కులస్తులు ఈమధ్య కాలంలో తమను తాము 'దేవేంద్రకుల వెల్లాలార్' (డికెవి) అని పిలుచుకుంటున్నారు. దేవేంద్రకుల వెల్లాలార్ ఫెడరేషన్ (డికెవిఎఫ్) అనే సంస్థ ఏర్పాటు చేసుకున్నారు. దాని అధ్యక్షుడు డాక్టర్ కె. కృష్ణస్వామి గత అసెంబ్లీ ఎన్నికలలో స్వతంత్రంగా పోటీ చేసి గెలిచాడు. అనేక సమస్యలపైన డికెవిఎఫ్ ఆందోళనలూ ఉద్యమాలూ చేస్తూ ఉంది. పల్లర్‌లు ఈ విధంగా తమ స్వతంత్ర రాజకీయ ప్రతిపత్తిని నిలబెట్టుకోవడం, పురోగమించడం సవర్ణులకు కంటగింపయింది.

ఉదాహరణకు, మే నెలలో రవాణా సంస్థ నామకరణం గురించి గొడవలు జరగకముందే, ఏప్రిల్ నెలలో చిదంబరనార్ జిల్లాలోని కోవిల్‌పట్టి అనే ఊరిలో చైత్రమాసంలో జరిగే రథోత్సవం విషయంలో గొడవ జరిగి ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. ఆ ఊరిలోని శెన్‌బగవల్లి (చంపకవల్లి) అమ్మవారి గుడిలో ప్రతి సంవత్సరం ఆ నెలలో పదిరోజుల పండగ జరుగుతుంది. ఒక్కొక్కరోజు పండగ నిర్వహించే హక్కు సంప్రదాయంగా ఒక్కొక్క కులానికి దక్కుతుంది. దళితులు తప్ప తక్కిన అన్ని కులాలకూ ఈ హక్కు సంచబడుతుంది. పదిరోజులలో అన్నిటికంటే ముఖ్యమైనది 9వ రోజు. అది తమిళ ఉగాది దినం. ఆరోజు రథోత్సవం జరుగుతుంది. అమ్మవారి రథాన్ని (తమిళంలో తేరు అంటారు) తాడుతో లాగే హక్కు అన్ని కులాలకూ ఉంటుంది – ఒక్క దళితులకు తప్ప. అయితే సంప్రదాయకంగా ఈ 'తేరు తిరువిళ' (రథోత్సవం) జరిగేటప్పుడు రథం చక్రాలకు దుడ్డుకర్ర అడ్డంపెట్టి దాని గమనవేగాన్నీ దిశనూ నియంత్రించే పని మాత్రం (బహుశా ఇది కష్టతరమైన పని కావడం వల్లనేమో) ఏడు పల్లర్ కుటుంబాలకు అప్పగించబడింది. దానికోసం వాళ్లకు కొంత మాన్యం కూడ ఇవ్వబడింది.

అయితే పల్లర్ కులస్తులు చైతన్యవంతులైన క్రమంలో అన్ని కులాలకు ఇచ్చినట్టు తమకు కూడ ఒకరోజు ఆ చైత్రమాసపు పండగ నిర్వహించే హక్కు ఇవ్వాలని డిమాండ్ చేయసాగారు. ప్రత్యేకించి, అన్ని రోజుల కంటే ప్రశస్తమైన 9వ రోజు (రథోత్సవం) పండగ తమ వంతు కావాలని వాళ్లు కోరడం వాళ్ల ఆత్మవిశ్వాసాన్ని సూచిస్తుంది.

ఒకరోజు పల్లర్‌లకు ఇవ్వాలంటే వేరొక కులం హక్కు తొలగించవలసిన అవసరం లేదు కూడా. సంప్రదాయకంగా 10 రోజుల పండగగా భావించబడే ఆ పండగను పొడిగించవచ్చు. నిజానికి ఒక దశాబ్ద కాలంగా ఈ పండగను 11రోజులు జరుపుకుంటున్నారు. ఒకప్పుడు పల్లర్‌లలాగే నాడర్ కులస్తులకు కూడ హక్కు ఉండేది కాదు. వాళ్లు కొట్లాడి 1984లో ఆ హక్కు సంపాదించుకున్నారు. అంతేకాదు, ఆ ప్రాంతంలో ఆర్థికంగా సాంఘికంగా బలవంతులయిన కమ్మవార్ నాయుళ్లకు (తెలుగు మాట్లాడే కమ్మకులస్తులకు) కూడ 1976 దాకా పండగ జరిపే హక్కు ఉండేది కాదనీ (బహుశా వాళ్లు శుద్ధమైన తమిళులు కాకపోవడం వల్లనేమో) ఆ సంవత్సరంలోనే వారికి ఆ హక్కు దక్కిందనీ అంటారు. పల్లర్‌లు తమ ఆందోళనలో భాగంగా, ఒకప్పుడు తమకు 9వరోజు రథోత్సవం నిర్వహించే హక్కు ఉండేదనీ తమకది ఆర్థికంగా భారం కావడం వల్ల తాము నిర్వహించడంలో విఫలం అయ్యేసరికి తమ హక్కు తాము కోల్పోయామనీ, అదే హక్కు తరువాత కమ్మనాయుళ్లకు బదలాయించబడిందనీ వాదించసాగారు. ఇది నిజం కాదని ఆ గుడి కార్యనిర్వాహక వర్గమూ స్థానిక బ్రాహ్మణులూ అంటున్నారు. అయినప్పటికీ పల్లర్‌లు తమ వాదన వదిలిపెట్టకపోయేసరికి కమ్మ నాయుళ్లకు గాభరా పట్టుకుంది. కమ్మనాయుళ్లకూ పల్లర్‌లకూ మధ్య ఘర్షణ వాతావరణం ఏర్పడింది. అయితే కమ్మవాళ్లు తాము దాడి చేయడానికి సిద్ధపడక తేవర్ యువకులకు డబ్బులిచ్చి తమ తరపున దాడి చేయడానికి తయారుచేసారు.

ఈ సంవత్సరం 9వ రోజు హక్కు తమకు ఇవ్వాలని పల్లర్‌లు

దేవేంద్రకుల వెల్లాలార్ ఫెడరేషన్ అధ్వర్యంలో గ్రామంలోని అంబేద్కర్ బొమ్మ దగ్గర నిరాహారదీక్షతో ఆందోళన ప్రారంభించారు. ప్రభుత్వ అధికారులు చర్చలు నిర్వహించారు. పండగను 12 రోజులకు పెంచి ఒకరోజు నిర్వహణ హక్కు పల్లర్‌లకు ఇవ్వడానికి అందరూ ఒప్పుకున్నారు గానీ 9వ రోజు హక్కే కావాలని పల్లర్‌లు పట్టుబట్టడం ఎవ్వరికీ (ముఖ్యంగా 9వ రోజు హక్కు అనుభవిస్తున్న కమ్మనాయుళ్లకు) రుచించలేదు. కానీ డాక్టర్ కృష్ణస్వామి చొరవతో పల్లర్‌లు ఒత్తిడిపెట్టి 9వ రోజు రథోత్సవం నిర్వహణలో తాము కూడ వాటా పొందారు. రోజంతా కమ్మనాయుళ్లు నిర్వహిస్తారు గానీ చివరి రెండు గంటల రథోత్సవ నిర్వహణ పల్లర్‌ల సారధ్యంలో ఉంటుందని ఒప్పందం చేసుకున్నారు.

ఈ విజయం సాధించుకున్న పల్లర్‌లు ఆ రెండు గంటల రథోత్సవాన్ని ఘనంగా జరపాలని నిర్ణయించుకున్నారు. 'దేవేంద్రకుల వెల్లాలార్ రథోత్సవానికి' 13 ఏప్రిల్‌నాడు రాత్రి వేలాదిగా తరలి రండని పోస్టర్లు అచ్చువేసి అంటించారు. వాళ్లకు రెండుగంటల హక్కు ఇచ్చినందుకు కమ్మనాయుళ్లకు కోపంగా ఉందనీ రెండుగంటలే ఇచ్చినందుకు దేవేంద్రకుల వెల్లాలార్‌లకు కోపంగా ఉందనీ 9వ రోజు ఘర్షణలు జరగ వచ్చుననీ ప్రజలు ఆందోళన చెందారు. అధికారులు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసారు. కమ్మనాయుళ్లు, తేవర్‌లు దుడ్డుకర్రలు తీసుకుని రథం లాగడానికి వచ్చారు. కమ్మనాయుళ్ల ఆధ్వర్యంలో రథోత్సవం ప్రారంభం కాగానే పల్లర్ యువకులు రాళ్లువేసారు. దుడ్డుకర్రలు పట్టుకున్న సవర్ణ యువకులు, లాఠీలు పట్టుకున్న పోలీసులు వాళ్ల వెంటబడి తరిమారు. పారిపోతూ వాళ్లు ఊరి వెలుపల ఉన్న (కమ్మనాయుళ్లకు చెందిన) ఫ్యాక్టరీల పైన దాడి చేసారు.

ఆ తరువాతే కమ్మనాయుళ్లు తేవర్ యువకులకు కత్తులూ కటారులూ కొనుక్కోవడానికి డబ్బులిచ్చారు. వాళ్లు ఆయుధాలు పట్టుకొని ఊరిలో పల్లర్‌లు నచ్చిపోయే బాటలపైన పచార్లు చేయసాగారు. ప్రతిరోజూ ఘర్షణలు జరిగాయి. పల్లర్‌లపైన చర్య తీసుకోవాలని సవర్ణులంతా కలిసి రెండురోజుల బంద్ నిర్వహించారు. పోలీసులు ఇదే అదనని పల్లర్‌లను పెద్దెత్తున అరెస్టు చేసి విపరీతంగా హింసించారు.

ఇదంతా ఏప్రిల్ నెలలోనే జరిగింది. మే 1వ తేదీన విరుధనగర్ జిల్లాలో వీరన్ సుందరలింగం ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (వివిటిసి) బస్సులు మొదలయ్యాయి. తేవర్ యువకులు వాటిపైన రాళ్లు, పేడ వేసారు. ఇది గొడవకు దారి తీయగలదని ఊహించిన పోలీసులు మే 2వ తేదీన పల్లర్ నాయకుడు ఎం ఎల్ ఏ డాక్టర్ కృష్ణస్వామిని వైగై జిల్లాలోని కందమనూర్‌లో 'ముందు జాగ్రత్త' చర్యగా అరెస్టు చేసారు. అకారణంగా జరిగిన ఈ అరెస్టువల్ల పల్లర్‌ల ఆగ్రహం పెరిగింది. ఆ తరువాత మూడురోజుల పాటు వైగై, మదురై, తిరునల్వేలి, విరుధనగర్, చితంబరనార్ జిల్లాలలో చాలా ఊర్లలో దళితులు ఊరేగింపులూ నిరసన ప్రదర్శనలూ చేపట్టారు. డాక్టర్ కృష్ణస్వామిని బేషరతుగా వదిలిపెట్టాలని డిమాండ్ చేసారు. తిరునల్వేలి జిల్లాలోని తిరైయూర్‌లో ఆందోళన చేస్తున్న దళితులపైన పోలీసులు కాల్పులు జరిపి ఇద్దరు దళితులను చంపారు. ఆ తరువాత డాక్టర్ కృష్ణస్వామిని రాష్ట్రప్రభుత్వం విడిచిపెట్టింది.

**ఇటువంటి ఘర్షణలు సంఘజీవితవాతావరణాన్నీ సంస్కృతినీ ధ్వంసం చేస్తాయి. అవి కేవలం వ్యక్తిగత ఘర్షణలు కావు. 'మీరెంతో మేమూ అంతే'నే దళిత చైతన్యాన్ని సహించలేని సవర్ణ అహంకారం వీటికి మూలం. అది పెరిగేకొద్దీ, ఘర్షణలలో రాటుదేలే కొద్దీ సామాజిక జీవన సంస్కృతి మరింత కలుషితం అవుతుంది.**

కానీ ఈ లోపల తేవర్‌లకూ పల్లర్‌లకూ (పరయార్‌ల వంటి ఇతర దళిత కులాలకు కూడ) గొడవలు రాజుకున్నాయి. ఇవి ప్రాణనష్టానికీ ఆస్తినష్టానికీ దారితీసిన కొన్ని ఊర్ల కథలు చూద్దాం.

విరుధనగర్ జిల్లాలోని తిరుత్తంగల్ అటువంటి ఒక ఊరు. ఈ ఊరిలోని ప్రధాన రహదారిపైన ఒక వరుసలో అంబేద్కర్, కామరాజ్, అన్నాదురై, వి.ఓ. చిదంబరంల విగ్రహా లున్నాయి. కొన్ని సంవత్సరాలుగా ఆ ఊరిలో జరుగుతున్న కుల ఘర్షణల కారణంగా అన్ని కులాలవాళ్లూ ఒక ఉమ్మడి అంగీకారానికి వచ్చారు. దళితుల ప్రదర్శనలూ ఊరేగింపులూ అంబేద్కర్ బొమ్మకూ కామరాజ్ బొమ్మకూ మధ్యనే నిర్వహించాలనీ, నాడార్‌ల ప్రదర్శనలు కామరాజ్ బొమ్మకూ అన్నాదురై బొమ్మకూ మధ్యనే నిర్వహించాలనీ, తేవర్‌ల ప్రదర్శనలు అన్నాదురై బొమ్మకూ చిదంబరం బొమ్మకూ మధ్యనే నిర్వహించాలనీ ఒప్పందం. మే 2వ తేదీన డాక్టర్ కృష్ణస్వామి అరెస్టు పట్ల నిరసన తెలుపుతున్న తిరుత్తంగల్ పల్లర్‌ల ప్రదర్శనలో పాల్గొనడానికి వస్తున్న పొరుగూరి పల్లర్ యువకుడిని తేవర్‌లు దారిలో కొట్టి అతని సైకిల్‌ను పాడు చేసారు. దానికి కోపగించుకుని తిరుత్తంగల్ పల్లర్‌లు తమ ప్రదర్శనను కామరాజ్ విగ్రహం ఆవలకు పరిమితం చేయకుండ ఈవలకు కూడ వచ్చారు. వాళ్లు ఒప్పందాన్ని అతిక్రమించారన్న నెపం పెట్టుకుని తేవర్‌లు వాళ్లతో గొడవకు దిగారు.

ఈ ఘర్షణ వాతావరణంలో మే నెల 25వ తేదీన తేవర్‌లు ఒక పరయార్ (ఇది పల్లర్‌ల కంటే ఇంకా వెనకబడిన దళిత కులం) యువకుడిని తీవ్రంగా కొట్టి గాయపరిచారు. ఈ ఘటన కాకతాళీయంగానే జరిగినప్పటికీ దీనివల్ల గొడవలు పెరిగాయి. పరయార్‌లు తేవర్‌లను దూషించడంతో తేవర్‌లు పెద్ద గుంపుగా పరయార్‌ల ఇళ్లపైకి పోయారు. వాళ్లు ఎదురుదాడి చేసి 55 సంవత్సరాల తేవర్ కులస్తుడైన సముద్రవేల్ పాండ్యన్‌ను తీవ్రంగా గాయపరిచారు. అతను తరువాత చనిపోయాడు. దీనికి ఆగ్రహించిన తేవర్‌లు పరయార్‌ల ఇళ్లపైనే కాక పల్లర్‌ల ఇళ్లపైన కూడ దాడి చేసి చాలా ఇళ్లు కాలబెట్టారు.

## శివకాశి కాల్పులు

విరుధనగర్ జిల్లాలోని శివకాశి నుండి తిరువిల్లిపుత్తూర్‌కు పోయే

రహదారికి ఇరువైపులా తేవర్ కులస్తులు అధిక మెజారిటీగా ఉన్న 18 గ్రామాలున్నాయి. వాటిని ఉమ్మడిగా '18 పల్లెలు' అంటారు. ఈ 18 పల్లెలలో ఒకటైన వడపట్టికి చెందిన యువకులు మే 1వ తేదీన విఎస్‌టిసి బస్సుపైన పేడ వేసారు. నిజానికి ఆ ఒక్క గ్రామంలో మాత్రమే అటువంటి ఘటన జరిగింది. కానీ ఆ ఘటనకు బాధ్యులయిన ఇద్దరు తేవర్ యువకులను పోలీసులు అరెస్టు చేయగానే 18 పల్లెలూ వారిని విడిపించుకోవడానికి కదిలాయి. వాళ్లు శివకాశికి ఊరేగింపుగా పోయి పోలీసులతో గొడవ పెట్టుకున్నారు. పోలీసులు వాళ్లను చెదరగొట్టడానికి వేరే ఏ మార్గాలూ అన్వేషించకుండ నేరుగా కాల్పులు జరిపి ముగ్గురిని చంపారు. ఇది జరిగింది మే నెల 7వ తేదీన.

ఈ కాల్పుల పట్ల తేవర్‌లు తెలిపిన నిరసన చాలా చోట్ల ప్రభుత్వానికి వ్యతిరేకంగా కాక పల్లర్‌లకు వ్యతిరేకంగా సాగింది. అటువంటి ఒక ఊరు విరుధనగర్ జిల్లాలోని మంసాపురం (అసలు పేరు మహమ్మద్ సాహెబ్‌పురం). ఆ ఊరిలోని పల్లర్‌లలో విద్యాధికులు చాలామంది ఉన్నారు. డాక్టర్ కృష్ణస్వామి అరెస్టుకు నిరసనగా మే 3వ తేదీన పల్లర్‌లు ఆ ఊరిలో పెద్ద ఊరేగింపు తీసారు. ఆ తరువాత వారికీ తేవర్‌లకూ నిత్యం చిన్నచిన్న ఘర్షణలు జరుగుతూనే ఉన్నాయి. అయితే తేవర్‌లను పోలీసులు ఎప్పుడు అరెస్టు చేసినా వాళ్లు పెద్ద గుంపుగా పోయి పోలీసులను బెదిరించి విడిపించుకొని వచ్చారు.

మే 7వ తేదీన శివకాశి కాల్పులలో ముగ్గురు తేవర్ కులస్తులు చనిపోవడంతో మంసాపురం తేవర్‌లు విజృంభించారు. 8వ తేదీన పెద్ద ఊరేగింపు తీసి ముఖ్యమంత్రి కరుణానిధి దిష్టిబొమ్మను తగలబెట్టారు. అంతవరకు బాగానే ఉందిగానీ ముఖ్యమంత్రిని 'కాష్టం' చేసిన ఆ తంతు దగ్గర సంప్రదాయక పద్ధతిలో విలపించవలసిందిగా ఒక పల్లర్ స్త్రీని బలవంతపెట్టారు. (ఈ సంప్రదాయక రోదనం పల్లర్‌ల కుల 'ధర్మాల'లో ఒకటి.) ఆమె నిరాకరించింది. 10వ తేదీన తేవర్‌లు ఊరేగింపుగా పోయి పల్లర్‌ల ఇళ్లపైన దాడి చేసారు. పల్లర్‌లంతా పారిపోయారు. ఏడుగురికి తీవ్రంగా దెబ్బలు తగిలాయి. 13 ఇళ్లు, చాలా గడ్డివాములు అగ్నికి ఆహుతయ్యాయి. ఇళ్లలోని డబ్బును ఇతర సంపదను లూటీ చేసారు. డివికె ఎఫ్ జెండా ఎగురుతున్న కర్రను విరగ్గొట్టారు.

ఆరోజు పారిపోయిన పల్లర్ స్త్రీలు మరుసటి రోజు (11వ తేదీ) తమ పశువుల కోసం వెనక్కి రాగా వారిలో శణ్ముగతాయి అనే 65 సంవత్సరాల స్త్రీని తేవర్‌లు నరికి చంపారు.

అదే రోజు పల్లర్‌లు అదే పద్ధతిలో అమానుషంగా ఎదురుదాడి చేసారు. తమ ఇళ్లమీదుగా మంసాపురం పోయే రోడ్డును బ్లాక్ చేసి ఒక ఫ్యాక్టరీలో పనిచేసి రాత్రి వెనక్కిపోతున్న ఇద్దరు తేవర్ కులానికి చెందిన కార్మికులను కిడ్నాప్ చేసారు. వాళ్ల ఆచూకీ ఇప్పటికీ తెలియడం లేదు. వాళ్లిద్దరినీ పల్లర్‌లు చంపేసి శవాలు మాయం చేసారని అందరూ నమ్ముతున్నారు. అక్కడితో ఆగకుండ పల్లర్‌లు 15వ తేదీన విధి నిర్వహణలో సైకిల్‌పైన పోతున్న వలైకులం గ్రామ కావలికార్ అయిన తేవర్ కులస్తుడు సుందరమూర్తిని దారిలో నరికి చంపారు. •

## మధురైలో ఘర్షణలు

మధురై తమిళనాడులోని మూడవ పెద్దనగరం (చెన్నై, కోయంబత్తూరుల తరువాత).

మేనెల మధ్యభాగంలో మధురైలో దళితులకూ సవర్ణులకూ మధ్య తీవ్ర ఘర్షణలు జరిగాయి. దాడులు ఇరుపక్షాలూ చేసారు కాబట్టి 'ఘర్షణలు' అంటున్నాము గానీ ఎక్కువగా దెబ్బతిన్నది దళితులేనని వేరే చెప్పనవసరం లేదు.

మేనెల 15వ తేదీన తిరునల్వేలి జిల్లాలోని వల్లియూర్‌లో అంబేద్కర్ విగ్రహాన్ని అగ్రకులస్తులు అవమానపరిచిన ఘటన ఈ ఘర్షణలకు మొదలు. 16వ తేదీన మధురైలోని దళితులు (ఇక్కడ పల్లర్‌ల కంటే పెద్దసంఖ్యలో ఉన్నది పరయార్‌లు, అరుంధతీయార్‌లు) దానికి నిరసనగా బంద్ నిర్వహించారు. ఈ ప్రయత్నాన్ని సవర్ణులు ప్రతిఘటించడంతో ఆ నగరంలో కులఘర్షణలు చోటు చేసుకున్నాయి.

మధురై నగరంలోని ఎం.కె.పురం ప్రాంతంలో బంద్ నిర్వహిస్తున్న దళిత్ పాంథర్స్ ఉద్యమ కార్యకర్తలను వ్యాపారస్తులు, ఇతర అగ్రకులస్తులు వ్యతిరేకించారు. ఒకరిమీద ఒకరు రాళ్లు వేసుకునేదాకా పోయింది. పోలీసులొచ్చి అదుపు చేసారు గానీ అరుంధతీయార్‌లు పోలీసులపైన కూడ రాళ్లు వేసేసరికి పోలీసుల కోపమంతా వాళ్లపైకి మళ్లింది. వాళ్లు దళితులపైన పడి పెద్దాచిన్నా తేడా లేకుండ అందరినీ చావబాదారు. స్త్రీలను చాలా అసభ్యంగా దూషించారు. బాష్పవాయువు ప్రయోగించి పోలీసులు దళితులను చెదరగొట్టారు. ఈ వాతావరణాన్ని తేవర్, నాడార్ తదితర సవర్ణ కులాలకు చెందినవారు ఆసరా చేసుకొని దళితుల ఇళ్లపైన దాడి చేసారు. కొన్ని ఇళ్లు తగలబెట్టారు. డబ్బు, ఇతర వస్తువులు దొంగిలించారు. వాళ్ల ఇళ్లలోని మేకలను పందులను చంపారు. ఒక అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసారు. 25 మంది దళితులకు ఈ దాడిలో గాయాలయ్యాయి.

ఈ దాడులకు బాధ్యుడు పెరియాంబలై తేవర్ అనే వ్యక్తి. భూబకాసురుడు, వడ్డీవ్యాపారి అయిన ఇతనితో ఎం.కె.పురం దళితులకు అంతకుముందు నుండి శత్రుత్వం ఉంది. గతంలో ఒకసారి ఘర్షణ జరగగా మధురై జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని రాజీ చేసాడు. అతను 16వ తేదీనాడు దళితులకూ పోలీసులకూ జరిగిన ఘర్షణను ఆసరా చేసుకొని వాళ్లపైన వాళ్ల ఇళ్లపైన దాడి చేయించాడు.

ఈ దాడికి గురయిన దళితులు పొరుగు ప్రాంతం అయిన మేలవాసల్‌కు పారిపోగా అక్కడ కూడ ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. పెరియంబలై తేవర్‌ను అరెస్టు చేయాలనీ అంబేద్కర్ విగ్రహాన్ని అగౌరవపరిచిన వారిని అరెస్టు చేయాలనీ డిమాండ్ చేస్తూ ఆ ప్రాంతంలో దళితులు ఆందోళన చేసారు. బంద్ పాటించని షాపులపైన రాళ్లు వేసారు. ఆటోలపైన, బస్సులపైన కూడ రాళ్లు వేసారు. దీనికి ప్రతీకారంగా జరిగిన ఎదురుదాడిలో దళితులకు చెందిన 9 చెప్పుల అంగళ్లు అగ్నికి ఆహుతి అయ్యాయి.

ఇక్కడ కూడ పోలీసులు రంగప్రవేశం చేయగానే దళితులు పోలీసులపైన రాళ్లే కాక పెట్రోల్ బాంబులు కూడ వేసారు. పోలీసులు కోపంతో పేట్రేగిపోయి విచ్చలవిడిగా లాఠీలతో జనాన్ని బాదుతూ దళితులకు చెందిన చాలా ఇళ్లు ధ్వంసం చేసారు. ఎటువంటి హెచ్చరికలు లేకుండ కాల్పులు జరిపారు. పళనికుమార్ అనే దళిత యువకుడి తలలో తూటా తగిలి అక్కడికక్కడే చనిపోయాడు. పోలీసులు చాలామంది

దళితులను అరెస్టు చేసి కొట్టారు. జైలుకు రిమాండు చేసిన తరువాత కూడ జైలులో వారిని కొట్టారు.

ఈ వాడలలో నివసించే దళితులలో చాలామంది మదురై నగర మునిసిపాలిటీ స్వీపర్లు కావడంతో వాళ్లకు ఈ నిర్బంధాన్ని ఎదిరించడానికొక మంచి సాధనం దొరికింది. వెంటనే మునిసిపాలిటీ స్వీపర్లందరూ సమ్మెకు దిగారు. స్వీపర్లకు ఉన్న రెండు యూనియన్లు (ఒకటి సిపిఐ- ఎం అనుబంధ సంస్థ, రెండవది అంబేద్కర్‌వాద సంస్థ) సమ్మెలో సంపూర్ణంగా పాల్గొన్నాయి. దానితో అధికార యంత్రాంగం కొంత మెత్తబడి అరెస్టయిన దళితులందరినీ విడిచిపెడతామన్న హామీ ఇచ్చి సమ్మె విరమింపజేసారు. ఆ హామీని వాళ్లు నిలబెట్టుకోలేదు గానీ అణచివేత తగ్గింది.

నగరంలోని ఇతర ప్రాంతాలలో ఇదే పమూనాలో సంఘటనలు జరిగాయి. వల్లియూర్‌లో అంబేద్కర్ విగ్రహాన్ని అవమానపరచిన వారిపైన చర్య తీసుకోవాలని మేనెల 15 సాయంత్రం దళితులు బంద్ జరిపించే ప్రయత్నం చేయగానే, తేవర్ పేరవై ఆధ్వర్యంలో తేవర్‌లు ఒకటై ఎదురుదాడికి దిగారు. వాళ్ల ఎంచుకున్న ఎదురుదాడి ఏమిటంటే తమ ప్రాంతాలలో ఉన్న అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేయడం. వందలాదిమంది తేవర్‌లు గుమిగూడి సెల్లూర్ ప్రాంతంలోని అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసే ప్రయత్నం చేసారు. అయితే అది కంచు విగ్రహం కావడం వల్ల దానిని ధ్వంసం చేయలేక ఎత్తుకుపోయారు! అయితే పోలీసులు రంగంలోకి వెంటనే దిగి దానిని తిరిగి స్వాధీనం చేసుకొని మళ్లీ నిలబెట్టారు. తేవర్ల ప్రతిఘటనను ఎదుర్కొనడానికి బాష్పవాయు ప్రయోగం చేసి లాఠీచార్జి చేసి 13 మందిని అరెస్టు చేసారు. అయితే ఆ తరువాత -బహుశా 'నిష్పక్షపాతంగా' కనబడడానికేమో - దళితుల ఇళ్లపైన దాడి చేసి ఆయుధాల కోసం వెతుకుతున్నామంటూ వాళ్లను కులం పేరిట అవమానపరిచి విచక్షణారహితంగా కొట్టి కేసులు పెట్టారు.

తేవర్ కులతత్వ వాదులకు నాయకులుగా నిలబడి తమపైన దాడులు చేయించిన వారి ఆస్తులపైన దళితులు దాడులు చేసి ధ్వంసం చేసారు. రాజాజీ పార్క్ సమీపంలో ఒక పళ్ల అంగడినీ ఒక ట్రాక్టర్ వర్క్‌షాపునూ ధ్వంసం చేసారు. కానీ దానికి ఘోరమైన ప్రతిఫలం చవిచూశారు. తేవర్‌ల గుంపొకటి ముల్లైనగర్ అంబేద్కర్ కాలనీపైన దాడి చేసి దళితులకు చెందిన 55 గుడిసెలు తగలబెట్టారు.

ప్రస్తుతం తమిళనాడు దక్షిణజిల్లాలలో ప్రశాంతత నెలకొనింది. కానీ అది తాత్కాలికమేననీ తిరిగి ఘర్షణలు చెలరేగకుండ ఉండాలంటే రాష్ట్ర ప్రభుత్వమేకాక పత్రికలూ రాజకీయ సంస్థలూ కూడ బాధ్యతగా వ్యవహరించవలసి ఉంటుందనీ పి.యు.సి. ఎల్ తన నివేదిక ముగింపులో విజ్ఞప్తి చేసింది.

●

# రణబీర్ సేన

డిసెంబర్ 1 నాటి రాత్రి 9 గంటలప్పుడు బీహార్ రాష్ట్రం జెహానాబాద్ జిల్లాలోని లక్ష్మణపూర్-బాటే అనే గ్రామంపై భూస్వాములకు చెందిన రణబీర్ సేన అనే సాయుధమూక దాడి చేసి దళిత, బాగా వెనుకబడిన కులాలకు చెందిన 61 మందిని హత్య చేసిన సంగతి దినపత్రికల్లో మొదటిపేజీల్లో పెద్దవార్తగా వచ్చి దేశమంతటా సంచలనం సృష్టించింది. భూస్వాములు సోనే నదిని దాటుతున్నప్పుడే చేపలు పట్టుకుంటున్న ఐదుగురు మల్లాలను (మల్లా ఒక వెనుకబడిన కులం. వీరు వృత్తిరీత్యా చేపలు పడతారు) చంపారు. ఆ తర్వాత నక్సలైటు సానుభూతిపరులయిన 14 ఎస్.సి,బి.సి కుటుంబాలపై దాడి చేసి 17 మంది పిల్లలు, 22 మంది స్త్రీలతో సహా మొత్తం 61 మందిని కాల్చిచంపారు. దాడికి భూమి తగాదాయే కారణమని పత్రికల్లో రాశారు. అయినా ఒక వారంలోపే ఈ దారుణ మారణకాండకు సంబంధించిన వార్తలు ఆగిపోయాయి. ఎక్కడ కూడా పెద్ద నిరసన వ్యక్తం కాలేదు.

1993లో భోజ్‌పూర్ జిల్లా బెలాల్ గ్రామంలో పుట్టినప్పటి నుండి రణబీర్ సేన - భోజ్‌పూర్, పాట్నా, జెహనాబాద్ జిల్లాల్లోని చాలా గ్రామాల ఎస్.సి, బి.సిల పైన లక్ష్మణపూర్-బాటే మీద దాడి చేసిన తరహాలోనే దాడి చేసింది. ఈ సేన సెప్టెంబర్ 1994-డిసెంబర్ 1996 మధ్య కాలంలో వందమంది పేద రైతులను, రైతుకూలీలను చంపిందని అంచనా. ప్రభుత్వ లెక్కల ప్రకారమే లైసెన్సు ఉన్నవి, లేనివి కలుపుకొని ఈ సేనకు దాదాపు 4000 తుపాకులున్నాయి.

## ఇంతకీ ఇది ఎవరి సేన?

రణబీర్ సేన భూమిహార్ల సేన. బీహార్ అగ్రవర్ణాల్లో భూమిహార్ అనే కులం ఒకటుంది. భూమిహార్లతో పాటు కాయస్తులు, రాజపుత్రులు, బ్రాహ్మణులు బీహార్‌లోని ప్రధాన అగ్రవర్ణాలు. అయితే వీరిలో బ్రాహ్మణులకు భూమిమీద పట్టు లేదు (కొన్ని ప్రాంతాలలో తప్ప). కాబట్టి గ్రామాల్లో వారికి ఆధిపత్యం కూడా లేదు. కాయస్తులు ప్రధానంగా ఉద్యోగ రంగానికే పరిమితమయ్యారు. బ్రాహ్మణులు, కాయస్తులు కాక భూమి ఉండి గ్రామాల్లో ఆధిపత్యం కొరకు పోరాటం చేస్తున్న కులాలు రెండు - భూమిహార్లు, రాజపుత్రులు. అక్కడక్కడ పఠాన్ భూస్వాములు కూడా కనబడతారు. 1980 దశకంలో పాట్నాలోని ఒక రిసర్చి కేంద్రం చేసిన అధ్యయనం ప్రకారం 69.5% ఎస్.సిలకు, 61% బాగా వెనుకబడిన తరగతుల వారికి అసలు భూమి లేదు (బీహార్‌లోని బి.సిలను వెనుకబడిన, బాగా వెనుకబడిన తరగతులుగా వర్గీకరించారు). ఎస్.సిలలో 5 ఎకరాల పైబడి భూమిగలవారు అరుదుగా కనిపిస్తారు. అగ్రవర్ణాల్లో 65%మందికి 5 ఎకరాల లోపే భూమి ఉంది. 5 ఎకరాలు పైబడిన కమతం గల రైతుల్లో 20%, 10 ఎకరాలు పైబడిన భూమిగల రైతుల్లో 12% యాదవ, కుర్మి, కోయిరి కులాల వారు. అంటే